
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 16 డిసెంబరు 2024



కొనసాగుతున్న క్యాబ్ డ్రైవర్ల ఆందోళన

శంషాబాద్ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓలా, ఉబర్ క్యాబ్ డ్రైవర్ల ఆందోళన కొనసాగుతోంది. ఆదివారం కూడ నిరసన తెలిపారు. రెండు రోజులుగా 34 వేల మంది క్యాబ్ డ్రైవర్లు ఆందోళన పాల్గొన్నారని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ చెప్పారు. అగ్రిగేటర్ సంస్థలు డ్రైవర్లకు తక్కువ చార్జీలు విధించడం వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, రవాణా శాఖ పలు మార్లు వినతి పత్రం అందజేసిన స్పందించడం లేదని ఆరోపించారు.

నిధుల్లేక.. పనులుకాక

- అర్ధంతరంగా నిలిచిన మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణం
- ఎనిమిదేళ్లుగా పూర్తికాని పనులు
- ఇబ్బందుల్లో అధికారులు, ప్రజలు



8

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు హర్షణీయం

- ఆనంద్ నాయక్‌ను అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- గ్రామాల అభివృద్ధికి దాతలు, యువత ముందుకు రావాలని పిలుపు



8

రోడ్లు బాగుచేయాలని నిరసన

- ప్రొద్దటూర్ గ్రామస్తుల ఆందోళన
- గుంతలమయంగా దారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- బీటీ వేయాలని డిమాండ్



8

జిల్లాలో నేడు

ఉచిత వైద్య శిబిరం

కడ్తాల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ సభ్యులు జర్పుల దశరథ్ నాయక్, ఉప్పల వెంకటేశ్ తెలిపారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. కడ్తాల మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్, దశరథ్ నాయక్ కోరారు.

కాటమయ్య రక్షణ కిట్ల వినియోగంపై శిక్షణ



ఆమనగల్లు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల గీత కార్మికులకు సోమవారం కాటమయ్య రక్షణ కవచం కిట్ల వినియోగంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. ఆమనగల్లు ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌లు కలిగిన గీత కార్మికులందరికీ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గీతకార్మికుల శ్రేయస్సును కాంక్షించి కిట్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గీతాకార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20, 21న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు , డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడల్లో భాగంగా ఈనెల 20, 21 తేదిలలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి తైక్వాండో టోర్నమెంట్, సెలెక్షన్స్ కల్వకుర్తి పట్టణంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే, తైక్వాండో జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఆమనగల్లులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్వకుర్తిలో రెండు రోజుల పాటు నిర్వహించే సీఎం కప్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాస్థాయిలో సెలెక్షన్ అయిన క్రీడాకారులకు ఈనెల 31, జనవరి 1, 2వ తేదీలలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని తైక్వాండో కార్యదర్శి బాబులాల్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి సీఎం కప్‌తో పాటు ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు.

వేతన వెతలు

ఎస్సీ హాస్టల్ వర్కర్స్‌కు అందని జీతాలు

ఎస్సీ వసతి గృహాల్లో పనిచేస్తున్న వర్కర్స్ వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎనిమిది నెలలుగా జీతాలు అందడం అల్లాడిపోతున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చే అతి తక్కువ జీతం కూడా సకాలంలో అందడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నెలవారీగా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

- ఎనిమిది నెలలుగా ఎదురుచూపులు
- కుటుంబాలు గడవడం లేదని ఆందోళన
- ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు




బియ్యం శుభ్రం చేస్తున్న కూలీలు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 52 వరకు ఎస్సీ వసతి గృహాలున్నాయి. 160 మంది ఔట్‌సోర్సింగ్, 44 మంది దినసరి కూలీలు పనిచేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న దినసరి కూలీకి రోజుకు రూ.532, గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ వసతి గృహాల్లో పనిచేస్తున్న కూలీకి రూ.432 చెల్లిస్తున్నారు. అలాగే ఔట్ సోర్సింగ్ కూలీకి నెలకు రూ.13 వేలు జీతం చెల్లిస్తున్నారు. ఔట్ సోర్సింగ్ కూలీలకు 8నెలల నుంచి వేతనాలు లేవు. అలాగే దినసరి కూలీలకు 5నెలలుగా వేతనాలు లేవు. దీంతో అప్పులు చేసి కుటుంబాలను

మిగతా 8వ పేజీలో...

జూలై నుంచి జీతాలు లేవు

జూలై నుంచి జీతాలు రావడం లేదు. బయట అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. పిల్లల స్కూలు ఫీజులు కూడా కట్టుకోలేక పోతున్నాం. 35 ఏళ్లుగా దినసరి కూలీగా పని చేస్తున్నా. ఇప్పటి వరకు పర్మినెంట్ కాలేదు. ప్రభుత్వం హాస్టల్‌లో పనిచేస్తున్న కూలీలపై కనికరం చూపాలి. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలి.

యశోద, దినసరి కూలీ
తాండూరు ఎస్సీ హాస్టల్

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 15, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తూ, పాఠశాలలను బలోపేతం చేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ ఠాగూర్ పాఠశాల ఆడిటోరియంలో కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 6వ జిల్లా మహాసభ రెండవ రోజైన ఆదివారం ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, విద్యార్థులకు సరిపోను ఉపాధ్యాయులు లేక విద్యాబోధనకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. అలాగే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఈ సభలో టీఎస్‌యుటీఎఫ్ నాయకులు చావ రవి, యాదయ్య, గోపాల్‌నాయక్, ఎం.వెంకటప్ప, బి.రాములయ్య, జగన్నాథ్‌శర్మ, కల్పన, బి.కృష్ణయ్య, వెంకటయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

మడుగులను తలపిస్తున్న రహదారులు

- రోడ్లపైనే నిలుస్తున్న మురుగు
- విజృంభిస్తున్న దోమలు
- వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు



కొత్తగూడ గ్రామ పంచాయతీలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిలిచిన మురుగునీరు

కందుకూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలలో పారిశుధ్యం పడకేసింది. రోడ్లపైనే మురుగు పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారులపై మురుగు నిలుస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

గ్రామ పంచాయతీల పాలక వర్గం కాలపరిమితి పది నెలల క్రితం ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీల పాలన కొనసాగుతోంది. అయితే అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో గ్రామాలలో సమస్యలు తిష్ట వేశాయి. అధికారులు వారానికి ఒక్కరోజైనా గ్రామాలలో పర్యటించక పోవడంతో రోడ్లపైనే మురుగు పరుగులు పెడుతోంది. వీధి దీపాలు కూడా వెలగక గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. కందుకూరు మండల కేంద్రంలోని కొత్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన మురుగు నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే ప్రధాన వీధుల్లో అండర్ డ్రైనేజీ మ్యాన్‌వల్ పగిలిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అనేక సమస్యలు తిష్ట వేసినా ప్రత్యేక అధికారి ఎంపీడీవో సరిత పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతీరోజు ఇబ్బందులు



కందుకూరు, కొత్తగూడ గ్రామ పంచాయతీలలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్లపై పారుతోంది. హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి ఎడమ పక్కన మురుగు నిలిచి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగును తొలగించాలి.

ఆనేగౌని యాదగిరిగౌడ్, వ్యాపారి

అధికారులు పట్టించుకోవడం లేదు



కొత్తగూడ గ్రామ పంచాయతీలో రోడ్డు మధ్యలో అండర్ డ్రెయినేజీ పగిలి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులకు ఎన్ని సార్లు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదు. రోడ్డుపై మురుగు పారి దుర్వాసన వస్తోంది. రోడ్డుపైకి రావాలంటేనే కాలనీ వాసులు భయపడుతున్నారు.

బొక్క శ్రీధర్‌రెడ్డి, కొత్తగూడ


ఇబ్రహీంపట్నంలోని గురునానక్ కళాశాల గేటు వద్ద లేట్‌గా వచ్చిన అభ్యర్థులు

తొలిరోజు గ్రూప్-2 ప్రశాంతం

90 కేంద్రాల్లో 45 శాతమే హాజరు

- ఆలస్యంగా వచ్చిన 14మంది అభ్యర్థులు
- అనుమతించని అధికారులు

రంగారెడ్డి అర్బన్/ షాద్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 పరీక్షలు ఆదివారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో మొత్తం 90 కేంద్రాల్లో 56,883 అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 45శాతం మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులను పరీక్షకు ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లో అనుమతించారు. 9.30 గంటల తర్వాత గేట్లు మూసివేశారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించ లేదు. ఇబ్రహీంపట్నంలోని శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష సెంటర్ వద్ద ఆరుగురు అభ్యర్థులు, గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రానికి ఎనిమిది మంది అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. వారిని కేంద్రంలోనికి అనుమతించలేదు. ఇబ్రహీంపట్నం వినోభానగర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు వెళ్లేందుకు బస్సు దిగి ఇబ్బందులు పడుతున్న ఆపరేషన్ అయిన మహిళా అభ్యర్థిని గమనించిన ఏసీపీ కేపీవీ రాజు తన వాహనంలో పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపించారు. ఇబ్రహీంపట్నం పరిధిలో మొత్తం 24 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 16,584 మంది అభ్యర్థులకు గాను 7,463 మంది హాజరయ్యారు. 9,121 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అలాగే మొయినాబాద్ మండలంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 5,503 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,479 మంది పరీక్షలు రాశారు. 4,024 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.


రూమ్ నంబర్‌ను చూసుకుంటున్న అభ్యర్థులు

ఏఎంసీ చైర్మన్‌కు కర్షక రత్న అవార్డు

చేవెళ్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్‌ను కర్షకరత్న అవార్డు వరించింది. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 17వ నేషనల్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్, సుబ్రమణియన్ తదితరులు పెంటయ్యగౌడ్‌కు అవార్డును ప్రదానం చేశారు. అయితే ఈ అవార్డు రావడం తనకు మరింత బాధ్యతను పెంచడంతో పాటు చాలా సంతోషంగా ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ స్పష్టం చేశారు.

మహాపిరమిడ్ ముస్తాబు

21 నుంచి పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు

- కైలాసపురి పత్రీజీ శక్తి స్థల్‌లో ప్రారంభమైన ఏర్పాట్లు
- ధ్యాన మహాయాగం చైర్మన్‌గా కొర్పోలు విజయభాస్కర్ రెడ్డి

ప్రపంచ ప్రసిద్ధ ధ్యాన కేంద్రమైన కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన మహోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 21 నుంచి 31వ తేది వరకు కొనసాగే పత్రీజీ ధ్యాన మహాయాగం-3 వేడుకలకు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కడ్తాల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి)

వివరాలు 7లో..


సర్వాంగ సుందరంగా మహేశ్వర మహాపిరమిడ్

‘అనంతగిరి’లో పార్కింగ్, కొబ్బరికాయల విక్రయానికి 18న వేలం

వికారాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో పార్కింగ్ ఫీజు వసూలు, కొబ్బరికాయల విక్రయానికి సంబంధించిన హక్కుల కొరకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో టి.నరేందర్ తెలిపారు. ఏడాది కాల పరిమితికి.. 2025 జనవరి 1 నుంచి డిసెంబరు 31వరకు పార్కింగ్, విక్రయాలకు హక్కు ఉంటుందన్నారు. కార్తీక మాసం మినహాయించి కొబ్బరికాయలు అమ్ముకునే హక్కుపై 18న వేలం నిర్వహిస్తామన్నారు. ఉదయం 11గంటలకు అనంతగిరి ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని, పాల్గొనదలచినవారు డిపాజిట్‌కింద రూ.లక్ష చెల్లించాలన్నారు. హక్కు పొందనివారికి డిపాజిట్ వాపస్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పాముకాటుతో బాలిక మృతి



సంగీత(ఫైల్)

దౌల్తాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. 17 ఏళ్ల క్రితం నందారం గ్రామానికి కుటుంబంతో వలస వచ్చిన సంగీత (17) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో చిన్న గుడిసె ఏర్పాటు చేసుకొని తల్లి రంగమ్మతో ఉంటూ బిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తోంది. ఈ క్రమంలో ఆదివారం గుడిసెలో ఉండగా సంగీత పాముకాటుకు గురైంది. వెంటనే తల్లి రంగమ్మ గ్రామస్థులకు సమాచారం అందించింది. అనంతరం కొడంగల్‌కు తరలించారు. అక్కడి నుంచి తాండూర్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా.. గంటసేపటి వరకు రాలేదు. అయితే, అప్పటికే బాలిక మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు డబ్బు పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

యాలాల డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల కమిటీని మండల కేంద్రంలో ఆదివారం మండల ఇన్‌చార్జి డప్పు మహేందర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు. మండలాధ్యక్షుడిగా సూర్యప్రకాష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పకీరప్ప, ఉపాధ్యక్షుడిగా సాయిలు, లాలప్ప, అధికార ప్రతినిధి శ్రవణ్, కార్యదర్శిగా నవీన్, సలహాదారుగా మెట్లి కృష్ణ, కార్యవర్గసభ్యులుగా నర్సింహులు, రాంచందర్, నరేష్‌లను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్-2050

- అమృత్ 2.0లో భాగంగా జీఐఎస్ ఆధారిత సర్వే
- 25 ఏళ్లకు అనుగుణంగా ‘బృహత్తర ప్రణాళిక’
- మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో డ్రోన్ సర్వే పూర్తి
- డీటీసీపీకి నివేదిక అందజేత



డ్రోన్ కెమెరాతో సర్వే చేస్తున్న సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది

తాండూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0లో భాగంగా జీఐఎస్(జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) ఆధారిత మాస్టర్ ప్లాన్ సర్వే పూర్తయ్యింది. ఇందులో భాగంగా డ్రోన్ సర్వేను సర్వే ఆఫ్ ఇండియా, మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా బృహత్తర ప్రణాళికతో చేపట్టారు. రాబోయే తరాల అవసరాల నిమిత్తం ‘మాస్టర్ ప్లాన్- 2050’కి ఈ డ్రోన్ సర్వేలో గుర్తించిన అంశాల ఆధారంగా ప్రణాళికలను రూపొందించనున్నారు. సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన డ్రోన్ పైలెట్స్ వర ప్రసాద్, గోపాల్‌లు తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో దాదాపు నెల రోజుల పాటు సర్వే చేపట్టారు. ఈ రెండు మున్సిపాలిటీలకు సంబంధించి డ్రోన్ ద్వారా చిత్రీకరించిన మ్యాప్‌లను డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగానికి సర్వే ఆఫ్ ఇండియా అధికారులు అందజేశారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసమే మాస్టర్ ప్లాన్ ను తయారు చేయనున్నారు.

25 ఏళ్లకు సరిపడా ప్రణాళిక

కేంద్ర ప్రభుత్వం రాబోయే 25 ఏళ్ల వరకు సంబంధించి పట్టణాల్లో పెరుగుతున్న మౌలిక వసతుల కల్పన, సమగ్రాభివృద్ధి కొరకు మాస్టర్ ప్లాన్ ద్వారా అమలు చేసే దిశగా డ్రోన్ సర్వేను చేపట్టింది. 25 ఏళ్లకు ఉపయోగపడేలా.. మున్సిపాలిటీ ఉపరితలం ఎత్తు, కుంటలు, చెరువులు, విస్తీర్ణం, చెరువులు, మార్కెట్ యార్డులు, సెల్‌టవర్లు, డ్రైనేజీ, రోడ్లు, ప్రధానమైన పంటలు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, సర్వే నంబర్‌ల వారీగా ప్లాన్, కోల్డ్ స్టోరేజీలు, మార్కెట్ల వారీగా రవాణా సదుపాయాలు, వ్యవసాయ భూమి, ఇళ్లు, చెట్లు, వాటర్ ట్యాంకులు, రైల్వే, బస్‌స్టేషన్లు, సాగు, తాగునీటి వనరులను డ్రోన్ సర్వే ద్వారా మ్యాపింగ్ చేశారు. మ్యాపింగ్‌ను, ఛాయా చిత్రాలను అనుసరించి భవిష్యత్తు తరాల అవసరాలకు తగ్గట్టుగా తయారు చేయబోయే మాస్టర్ ప్లాన్‌కు ఈ డిజిటల్ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్లానింగ్ పూర్తికి ఆరు నెలల సమయం

క్షేత్రస్థాయిలో చేపట్టిన డ్రోన్ సర్వే చిత్రాలు, రికార్డులను ఆసరాగా చేసుకొని 20 ఏళ్లకు పైబడిన మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయనున్నారు. అమృత్ 2.0లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 20 మున్సిపాలిటీలను ఎంపిక చేయగా జిల్లాలో వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీలు ఎంపికయ్యాయి. వికారాబాద్ మున్సిపాలిటీలో 21.12 స్క్వేయర్ కిలోమీటర్లు, తాండూరులో 21.02 స్క్వేయర్ కిలోమీటర్ల పరిధిని గుర్తించినట్లు డీటీసీపీ అర్బన్ ప్లానర్ హరిత తెలిపారు. తాండూరులో 6 వేల ఎకరాల విస్తీర్ణం గుర్తించమన్నారు. ఈ సర్వే నివేదికను డీటీసీపీ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వివరించారు. సేకరించిన వివరాల ప్రకారం ప్రణాళికను పూర్తి చేసేందుకు ఆరు నెలల గడువు పడుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఇద్దరు ప్రతినిధులం డ్రోన్ సర్వే చేశామని అందులో ఒకరైన వరప్రసాద్ తెలిపారు. ఛాయ చిత్రాలు తీసి సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి అందజేశామన్నారు. 50 లక్షల జనాభా గల పట్టణాల్లో డ్రోన్ సర్వేను చేపట్టామని, పట్టణాలకు కావాల్సిన అవసరాలను సర్వే ద్వారా గుర్తిస్తారని పేర్కొన్నారు.

15 రోజుల పాటు డ్రోన్ సర్వే

వికారాబాద్ జిల్లాలో ఎంపికైన వికారాబాద్ మున్సిపాలిటీలో అక్టోబరు 16 నుంచి 24 వరకు, తాండూరులో అక్టోబరు 28న ప్రారంభమై నవంబరు 8 వరకు డ్రోన్ సర్వేను చేపట్టారు. వికారాబాద్ మున్సిపాలిటీలో 34 వార్డులు, తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డుల ఏరియాల్లో ప్రతీ 2 కిలోమీటర్లకు ఒక కంట్రోల్ పాయింట్‌తో భౌగోళిక ప్రాంతాలను గుర్తించారు. తాండూరులో 46 కంట్రోల్ పాయింట్ల ద్వారా సర్వే నిర్వహించారు.

గర్వంగా ఉంది



తన పదవీ కాలంలో 20 ఏళ్లకు, భవిష్యత్తు తరాలకు అవసరమయ్యే ప్రణాళికను తయారు చేయడం అదృష్టంగా భావిస్తున్నా. పాలక మండలి సభ్యులందరి సహకారంతో రాబోయే తరాలకు అవసరమయ్యే మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం తెలిపే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నా. ముఖ్యంగా తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటల్లో విలీనమైన ప్రాంతాలకు మాస్టర్ ప్లాన్-2050 ఎంతో ఉపయోగపడుతుంది. అభివృద్ధి చెందే అవకాశాలుంటాయి. తాండూరులో విలీన ప్రాంతలైన ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, కోకట్ రోడ్డు మార్గాలు అభివృద్ధి చెందే అవకాశాలుంటాయి.

- స్వప్న, మున్సిపల్ చైర్‌పర్సన్, తాండూరు

ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీ

పోగొట్టుకున్న పర్సు బాధితురాలికి అందించిన డ్రైవర్, కండక్టర్



అమీనాబీకి పర్సు అందిస్తున్న కండక్టర్, పక్కన డ్రైవర్

పరిగి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిగి నుంచి షాద్‌నగర్ వెళుతున్న బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధ మహిళ పర్సు పోగొట్టుకుంది. పరిగి మండలం చిట్యాల్ గ్రామానికి చెందిన అమీనాబీ ఆదివారం పరిగి బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి చిట్యాల్‌లో దిగిపోయింది. ఈక్రమంలో బస్సు సీట్లో పడి ఉన్న ఆమె పర్సును మరో ప్రయాణికుడు తీసుకుంటుండగా కండక్టర్ శ్యామల గమనించింది. అది నీది కాదు కదా.. ఎలా తీసుకుంటావ్.. అని చెప్పి ప్రయాణికుడి నుంచి తీసుకుంది. కాగా, పర్సులో రూ.10వేల నగదు, ఆధార్‌కార్డు ఉంది. దాంతో ఆధార్ కార్డు ఆధారంగా చిట్యాల్ గ్రామానికి చెందిన అమీనాబీదిగా గుర్తించారు. గ్రామానికి వెళ్లి రూ.10వేల నగదు, పర్సును బాధిత మహిళకు అందజేశారు. దాంతో స్థానికులు డ్రైవర్,కండక్టర్లను అభినందించారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో భక్తులు

తలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం రథోత్సవం, భజన పోటీలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి తాళ్లతో రథాన్ని లాగి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవంలో రాంపూర్‌తో పాటు సమీప గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పవన్ కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, స్థానిక మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మాజీ ఎంపీపీలకు మాతృవియోగం

నివాళులర్పించిన సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి, యాదయ్య



నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మాజీ ఎంపీపీలు మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి, మల్గారి విజయ్‌భాస్కర్‌రెడ్డిలకు మాతృవియోగం కలిగింది. వారి తల్లి రాములమ్మ(92) అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులు ఆదివారం ఉదయం మృతదేహానికి పూలతో నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వివిధ పార్టీల నాయకులు, చేవెళ్ల మండల నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



వివరాలు సేకరిస్తున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్ల అందించేందుకు కృషి చేస్తుందని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేష్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని 33వ వార్డు బీటీఎస్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పర్యవేక్షించారు. వార్డు కమిటీ సభ్యులు, మునిసిపల్ వార్డు ఆఫీసర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భజన భక్తులకు సన్మానం



భజన భక్తులకు ఆర్థిక సాయం అందిస్తున్న కృష్ణమోహన్

చేవెళ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పామెన గ్రామంలో కార్తీక మాసంలో 41 రోజుల పాటు హనుమాన్ దేవాలయంలో ప్రతీ రోజు భజనలు చేసిన భజన భక్తులను గ్రామానికి చెందిన బీజేపీ యువమోర్చా మండలాధ్యక్షుడు కృష్ణమోహన్ ముదిరాజ్ ఆదివారం గ్రామంలో ఉన్న భజన భక్తులను అభినందించడంతో పాటు రూ. 5వేల ఆర్థిక సాయం అందించి సత్కరించాడు. కార్యక్రమంలో భజన భక్తులు రాములు, నర్సింలు, గోపాల్, శేఖర్, రాంచంద్రయ్య, అంజయ్య, శివనాగం, ఆత్మలింగం, సదానందం, శ్రీశైలం, ప్రసాద్‌కుమార్, విజయ్, రవి, కృష్ణ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



లీలావతిని పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాండూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషితమైన ఆహారం తిని అస్వస్థతకు గురైన పెద్దేముల్ మండలం బాయిమీది తండాకు చెందిన విద్యార్థిని లీలావతికి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం రాత్రి నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాలికకు అందిస్తున్న వైద్యసేవలపై ఆర్‌ఎంవోతో చర్చించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. లీలావతి తండ్రి తారా సింగ్‌తో మాట్లాడి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మిగతా విద్యార్థులు కూడా కోలుకుంటున్నారని, లీలావతి ఒక ట్రెండు రోజుల్లో కోలుకుంటుందని చెప్పారు. కాగా, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హాస్టల్ ఇన్‌చార్జి వినోద్‌ను ఆయన ఫోన్‌లో ఆదేశించారు.

దేవుని పడకల్ ఆలయంలో నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు



వేంకటేశ్వర స్వామి ఆలయం

తలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం శ్రీ గోదాదేవి ధనుర్మాస ఉత్సవాలకు ముస్తాబైంది. నేటి(సోమవారం) నుంచి ప్రారంభమయ్యే ధనుర్మాస వేడుకలు జనవరి 14వ తేదీ వరకు కొనసాగుతాయి. నెల రోజులపాటు నిర్వహించే వేడుకలకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. భక్తులకు విశాల వసతులు కల్పించారు. ప్రతీరోజు అర్చన, మహానివేదన, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, ధర్మకర్త రామాచార్యులు తెలిపారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి వేడుకలు, ఉత్తర ద్వారా ప్రవేశ దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 13న గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధనుర్మాస వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం కోరారు.

మహిళల అత్యాచారాలపై ఉద్యమించాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలపై ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వి నేద పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టడంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆరోపించారు. మద్యం, డ్రగ్స్ గంజాయి లాంటి మాదక ద్రవ్యాలు సేవించడంతో పాటు చాలా చోట్ల మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నట్లు తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలన్నారు. మహిళల సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు.

ఐద్వా మేడ్చల్ మండల నూతన కమిటీ

ఐద్వా మేడ్చల్ మండల అధ్యక్షురాలిగా గౌతమి, ప్రధాన కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా శ్రావణి, ఉపాధ్యక్షురాలిగా లత, సహాయ కార్యదర్శిగా జ్యోతిలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పల్లవి, డాలి, స్వరూప, బాలమణి, బాషమ్మ, లూదియాలను ఎన్నుకున్నారు.

మా భూములు మాకివ్వండి!

అటవీ శాఖ అధికారులను కోరిన రైతులు



తాండూరు మండలం అంతారం శివారులో రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న భూమి

తాండూరు రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మా భూములు మాకివ్వాలని రైతులు అటవీ శాఖ అధికారులను కోరారు. తమకున్న కాస్త భూమిని స్వాధీనం చేసుకోవడంతో ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేశారు. తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన రైతులు ఆదివారం మీడియాతో తమ బాధను వెల్లడించారు. తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 58/2/అ లో రైతు వడ్డె సాయప్పకు గతంలో అసైన్డ్ భూమి ఉంది. అయితే, ఆయన మరణానంతరం కుటుంబికులైన వడ్డె జగదీశ్వర్‌కు 2 ఎకరాలు, వడ్డె అమృతమ్మకు 26గుంటలు, వడ్డె రాములుకు 14 గుంటలు, వడ్డె అంజిలప్ప 27 గుంటల చొప్పున భూమిని తమతమ పేర్లపై పట్టా చేసుకున్నారు. దాంతో వారు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. అయితే, అటవీశాఖ అధికారులు అర్బన్ పార్కు పేరిట తమ భూముల చుట్టూ కంచె వేసి స్వాధీనం చేసుకున్నారని రైతులు వాపోయారు. అక్రమంగా అధికారులు తమ భూమిని లాక్కున్నారని.. తమ వద్ద ఆధారాలున్నాయని వాపోయారు. కాగా, తమ వద్ద పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని, అటవీ అధికారులు మాత్రం ఫారెస్ట్ భూములంటూ చుట్టూ కంచె వేసి అందులోకి రానివ్వడం లేదని వాపోయారు. కాగా, అది ఫారెస్ట్ ల్యాండేనని, 2019లో అక్రమంగా రైతులు అటవీ భూమిలోకి వచ్చి ఆక్రమించుకున్నారని అటవీ రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతి తెలిపారు. కాగా, ఆ రైతులకు డంపింగ్ యార్డు పక్కనున్న ప్రభుత్వ భూమిలో పట్టా భూమి ఉందని, టైమ్‌లైన్ మ్యాప్ ద్వారా పరిశీలిస్తే ఆ రైతుల భూమి ఫారెస్ట్ భూమిగా తేలిందని చెప్పారు. వాటర్ బాడీ వద్ద భూమిని ఆక్రమించుకున్నామని, ఫారెస్ట్ అధికారులు రైతుల భూమిని ఆక్రమించలేదని, తప్పుడు ప్రచారం చేయవద్దని తెలిపారు.

ఆరు గ్యారెంటీల పేరుతో మోసం

మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఆనంద్

వికారాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యేబీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కావలి మల్లేశం, ఖలీల్ పాషా, కురువ ప్రవీణ్, కురువ మల్లేశం, మహేష్ కుమార్‌లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈమేరకు ఆనంద్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల సంగతి పక్కన పెడితే.. ప్రజా ధనాన్ని వృథా చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కనీస సమస్యలను పట్టించుకునే స్థితిలో లేదన్నారు. కాంగ్రెస్ నాయకుల నిర్ణయాల వల్ల ఎంతోమంది నష్టపోయారన్నారు. తెలంగాణ తిరిగి అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుండాలంటే కేవలం బీఆర్‌ఎస్ పార్టీ కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నాయకులు ఫయాజ్, మహిపాల్ రెడ్డి, అశోక్, మల్లేశ్, కావలి వెంకటేశ్, శ్రీనివాస్ గౌడ్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నానక్‌నగర్‌లో కల్వర్టు వద్ద మురుగు ఇలా..

మురుగు సమస్యను పరిష్కరిస్తాం



మురుగు నిల్వకుండా తగిన చర్యలు తీసుకుంటాం. నీరంతా నేరుగా భూమిలోకి వెళ్లేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపడతాం. ప్రతీ గ్రామంలో వాడవాడలా, ఊరి చివరన భారీ ఇంకుడుగుంతలు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తాం. ప్రజలు తప్పకుండా వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి.

- శ్రీలత, ఎంపీవో, యాచారం

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- పల్లెల్లో పడకేసిన ప్రత్యేకాధికారుల పాలన
- సమస్యలతో ప్రజలు సతమతం
- అధ్వానంగా మురుగు కాలువలు.. పేరుకుపోతున్న చెత్తాచెదారం
- తాగునీటి పైపులైన్లకు లీకేజీలు
- మరమ్మతులు చేపట్టాలని ప్రజల వేడుకోలు



కుర్మిద్దలో మురుగుతో నిండిన భూగర్భ డ్రైనేజీ

యాచారం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. దాంతో సమస్యల సుడిగుండంలో ప్రజలు సతమతమవుతున్నారు. పల్లెల్లో మురుగు కాలువల పరిస్థితి దయనీయంగా మారడంతో జనం దోమలతో వేగలేకపోతున్నారు. పలు గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్లు లీకవడంతో నీరు కలుషితమవుతోంది. మురుగునీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతోనే రోడ్లపై మురుగు పరుగు పెడుతోంది. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా మురుగు కాలువల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. మండల పరిధిలోని తాటిపర్తిలో నెల రోజుల క్రితం భూగర్భ డ్రైనేజీ పైప్ పగలడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. నానక్‌నగర్‌లో మురుగు నెల రోజులుగా రోడ్లపై పారుతోంది. పాఠశాల ఎదుట నీరు నిలుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ ఇంకుడు గుంతలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మేడిపల్లిలో తూంబాయికుంటలోకి మురుగు నీరు చేరుతుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి నానక్‌నగర్ వెళ్లే దారిలో మురుగు ఎక్కడికక్కడే నిలుస్తోంది. అసంపూర్తి భూగర్భ డ్రైనేజీ పనులతో పాఠశాల నుంచి వెళ్లే పైప్ లైన్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందిగా మారింది. చిన్నతూండ్లలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని కల్వర్టు నుంచి పంట పొలాలకు గ్రామంలోని మురుగు నీరు వెళుతుంటుంది. అయితే, కల్వర్టు వద్ద మురుగు నిలుస్తుండటంతో దోమలకు నిలయంగా మారింది. చౌదర్‌పల్లిలోని డ్రైనేజీలో మురుగు ఎక్కడికక్కడే నిలుస్తోంది. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి కాలువలు దోమలకు నిలయంగా మారాయని గ్రామస్తులు వాపోతున్నారు. కొత్తపల్లి, తక్కళ్లపల్లి, చింతపట్ల, మొండిగౌరెల్లి, నల్లవెల్లి గ్రామాల్లో మురుగు రోడ్లపై పారుతుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. యాచారం మండల కేంద్రంలో పుడమి పాఠశాల వద్ద మురుగు నిలుస్తుండటంతో దోమల బెడద తట్టుకోలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. గున్‌గల్‌లో హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారికి ఆనుకొని మురుగు నిలుస్తున్నా పంచాయతీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గున్‌గల్‌లోని పలు వీధుల్లో మురుగు ఏరులై పారుతోంది. కాగా, ప్రతీ గ్రామంలో భారీ ఇంకుడు గుంతలు నిర్మిస్తేనే సమస్య తీరుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి ఇంకుడు గుంతల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలి



మురుగు కారణంగా దోమల బెడద అధికమవుతోంది. దాంతో ప్రజలకు డెంగీ, తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. మురుగు సమస్య తీరాలంటే ప్రతీ గ్రామంలో భారీ ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలి. ప్రతీ గ్రామానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేపట్టాలి. పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపాలి.

- ఎ.నర్సింహ, మేడిపల్లి

ఘనంగా దత్త జయంతి

- భక్తిశ్రద్ధలతో గణపతి, దత్త హోమం
- ధూప హారతిలో పాల్గొన్న భక్తులు



దత్త హోమంలో భక్తులు

ఆమనగల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆమనగల్లు పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో దత్త జయంత్యుత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుదత్త జయంతి వేడుకల నేపథ్యంలో సాయిబాబా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా, శోభాయామానంగా అలంకరించారు. ఆమనగల్లు పట్టణంతో పాటు సమీప గ్రామాల సాయి భక్తులు, ప్రజలు వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సాయి నామస్మరణతో సాయిబాబా దేవాలయం మార్మోగింది. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారికి మేలుకొలుపు పాడారు. అనంతరం సాయిబాబా మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో అలంకరించి ఆలయ నిర్వాహకులు మధుసూదనాచారి, రవికిరణ్‌ల ఆధ్వర్యంలో అర్చకులు రాజేశ్వర్‌రావు, నయనాచారి, ఆనంద్ పాండు, ఆదర్శ్ పాండేల ఆధ్వర్యంలో కాగడహారతి, మంగళస్నానం, అభిషేకం, సంస్థాన్ హారతి, అర్చనలు, అఖండ సాయి నామ సంకీర్తన, గణపతి, దత్తహోమం, ధూపం హారతి, పలకీసేవ, శేషహారతి కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, శ్వేత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన దత్త హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాలాది ఆంజనేయులు, పాపిశెట్టి కుమారస్వామి, పాపిశెట్టి రాము, రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల సర్వతోముఖాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాశ్రేయస్సును కాంక్షించి రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. మండలంలోని గట్టిప్పలపల్లి, వెంకట్రావ్‌పేట, ఆర్లకుంట తండా, గడ్డమీది తండా గ్రామస్థులు ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డితో సమావేశమయ్యారు. గట్టిప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరు పడకల నుంచి 12 పడకలకు పెంచాలని, కల్వకుర్తి, తలకొండపల్లికి గ్రామం నుంచి వెళ్లేరోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, గట్టిప్పలపల్లి నుంచి వీరన్నపల్లి మీదుగా కొత్త గేటు వరకు బీటీరోడ్డు నిర్మించాలని, గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే తండాలకు రోడ్లు నిర్మించాలని, గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామాలు, గిరిజన తండాలకు బీటీ రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని రోడ్ల బీటీ, మరమ్మతులు, ఆధునీకరణకు రూ.300 కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేసిన రూ.204 కోట్లతో రోడ్ల పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు కసిరెడ్డి చెప్పారు. కల్వకుర్తి అభివృద్ధికి సీఎం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాజధానికి చేరువలో ఉన్న కల్వకుర్తి ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి మొదటి విడత 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, మరో 1,000 ఇళ్లు అదనంగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేపీసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ లు శరత్‌చంద్ర, ఆంజనేయులు, కార్యదర్శి అనిల్, రమేశ్‌నాయక్, రాజు, శ్యామల కుమార్, సురేశ్, రవీందర్, మల్లేశ్, ఖలీం, చెన్నయ్య, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు వెంకట్ రెడ్డి, బాబా, రవీదర్, విజయ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు సాహసోపేత నిర్ణయాలు




ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహను సన్మానిస్తున్న మంజులా చంద్రమౌళి, సులోచనా సాయిలు, నర్సింహ, నాయకులు

కడ్తాల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ తోడ్పాటుతో రైతులు కష్టాల నుంచి వైదొలిగి తెలంగాణ రాష్ట్రం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని, రైతుల శ్రేయస్సుకు, సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. మక్తమాదారంలో ఆదివారం చైర్‌పర్సన్ గీతకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, ఎంపీటీసీ మంజులా చంద్రమౌళి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింహగౌడ్, కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్ ఆధ్వర్యంలో గీతను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. మక్తమాదారం గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ద్వారా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. నాయకులు కృష్ణ, చెన్నయ్య, నారాయణ, అరకొట కృష్ణయ్య, గణేశ్,శ్రీను, యాదగిరి, మహేశ్, యాదయ్య, చంద్రయ్య, రాజేందర్, నరేశ్‌గౌడ్, రమేశ్, నాగేశ్, ప్రభాకర్, రమేశ్, శ్రీను, సాయిలు, అంజయ్య, కన్నయ్య, యూసఫ్, నసీరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మహా పిరమిడ్ ముస్తాబు

- ఈనెల 21 నుంచి 31 వరకు వేడుకలు
- ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని కైలాసపురి పత్రీజీ శక్తి స్థల్‌లో భారీ ఏర్పాట్లు
- ధ్యాన మహాయాగం చైర్మన్‌గా కొర్పోలు విజయభాస్కర్ రెడ్డి



శోభాయమానంగా పిరమిడ్ కింగ్ చాంబర్

కడ్తాల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధ ధ్యాన కేంద్రమైన కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మహోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 21 నుంచి 31 వరకు కొనసాగే పత్రీజీ ధ్యాన మహాయాగం-3 వేడుకలకు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. డిసెంబరు 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో ఈసారి వేడుకలకు, కడ్తాల ప్రాంతానికి ప్రత్యేకత సంతరించుకుంది. భారత ధ్యాన విలువలను ధ్యాన గురువు, దివంగత సుభాష్ పత్రీజీ విశ్వవ్యాప్తం చేయడానికి తన వంతు కృషి సల్పిన నేపథ్యంలో ఐక్య రాజ్య సమితి గుర్తింపు ఇవ్వడంతో ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల నుంచి వేడుకలకు పెద్దఎత్తున ధ్యానులు, సందర్శకులు పెరిగే అవకాశం ఉన్నందున నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యాసకుల రాకతో పిరమిడ్‌లో సందడి మొదలైంది. కాగా, పత్రీజీ పరమపదించిన అనంతరం ధ్యాన మహా వేడుకల్లో లోటు లేకుండా చైర్మన్ కొర్పోలు విజయభాస్కర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈనెల 21 నుంచి 11 రోజుల పాటు కొనసాగే ధ్యాన సంబురాలకు తెలంగాణ, ఏపీ నుంచి ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు, సందర్శకులు, సాధకులు, ఆధ్యాత్మిక వేత్తలు, కళాకారులు తరలిరానున్నారు. దేశ, విదేశాల నుంచి కూడా ఈ వేడుకలకు పిరమిడ్ మాస్టర్లు, పలువురు కళాకారులు, అభ్యాసకులు, ఆధ్యాత్మిక వేత్తలు హాజరవుతున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కాగా, ధ్యానులు, సందర్శకులకు ఉచిత వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. సరస్వతి ప్రాంగణంలో ఒకేసారి లక్ష మంది ధ్యానం చేసేలా ఏర్పాట్లు చేశారు. ప్రతీరోజు లక్ష మందికి భోజన వసతి కల్పిస్తున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ సభ్యురాలు మాధవి తెలిపారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు అఖండ సంగీత ధ్యానం, పత్రీజీ వీడియో సందేశం, ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, గురు సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే పిరమిడ్‌లోని సరస్వతి ప్రాంగణంలోని పత్రీజీ శక్తిస్థల్‌లో ధ్యాన వేదిక, ప్రాంగణం చలికి తట్టుకునేలా ఏర్పాట్లు ప్రారంభించారు. ఈనెల 21న సాయంత్రం 5గంటలకు పత్రిజీ సతీమణి స్వర్ణమాల పత్రీజీతో కలిసి పలువురు రాజకీయ ప్రముఖులు ఉత్సవాలను ప్రారంభిస్తారని ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు.



అభ్యాసికుల కోసం ఏర్పాటు చేసిన కాటేజీలు

గురువు పత్రీజీ కృషి ఫలితంగానే..



మాట్లాడుతున్న పీఎస్‌ఎస్‌ఎమ్ కో-ఆర్డినేటర్ మాధవి

డిసెంబరు 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించడం భారత ధ్యాన విప్లవాన్ని విశ్వవ్యాప్తం చేసిన ప్రపంచ ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ కృషి ఫలితమేనని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా కో-ఆర్డినేటర్ మాధవి అన్నారు. ధ్యాన, శాకాహార విలువలను ప్రపంచ వ్యాప్తం చేసిన ఘనత పత్రిజీకే దక్కిందన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో ఆదివారం విలేకరులతో మాధవి మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ 1990 లో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీని స్థాపించి దేశ వ్యాప్తంగా ధ్యాన విలువలను చాటా రన్నారు. 2007లో బెంగళూరు, 2011 లో హైదరాబాద్‌లో ధ్యాన పిరమిడ్‌లను స్థాపించి తద్వారా దేశ వ్యాప్తంగా 10 వేల పిరమిడ్‌లను నిర్మించి లక్షలాది మందికి ధ్యానం నేర్పించిన పత్రీజీ చిరస్మరణీయుడని అన్నారు. మహేశ్వరం మహాపిరమిడ్ వేదికగా 2012లోనే పత్రీజీ ప్రతీయేటా డిసెంబరు 21వ తేదీని ధ్యాన దినోత్సవంగా ప్రకటించి 11 రోజుల పాటు మహాసభలు నిర్వహిస్తూ వచ్చారని గుర్తు చేశారు. కాగా, వేడుకలకు భారీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు శ్రీరామ్ గోపాల్, హనుమంత రాజు, రాంబాబు, సాంబశివరావు, దామోదర్ రెడ్డి, నిర్మలాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కొడంగల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలో కొన్ని రోజులుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వాజిద్‌ఖాన్ అనే వృద్ధుడు అనారోగ్యం కారణంగా ఆదివారం మృతిచెందాడు. వారం రోజుల క్రితం అమ్మనాన్న ఫౌండేషన్ ప్రతినిధులు వాజిద్‌ఖాన్ అనారోగ్యంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఆసుపత్రిలో ఆయన మృతి చెందాడు. విషయాన్ని ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ స్థానిక పోలీసులకు సమాచారం అందించి స్థానికుల సహాయంతో అంత్యక్రియలు నిర్వహించారు.

మనస్తాపానికి గురై..

ఫినాయిల్ తాగిన గురుకుల విద్యార్థిని



చికిత్స పొందుతున్న నందిని

దోమ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన పదో తరగతి విద్యార్థిని ఫినాయిల్ తాగింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలంలో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఆదివారం చోటుచేసుకుంది. పదో తరగతి చదువుతున్న నందిని పాఠశాలలోని తోటి విద్యార్థిని దగ్గర రూ.500 దొంగతనానికి పాల్పడిందని తోటి స్నేహితులు గేలి చేశారు. దాంతో మనస్తాపానికి గురై ఫినాయిల్ తాగింది. కేజీబీవీ సిబ్బంది, తోటి విద్యార్థులు పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

నిధుల్లేక.. పనులుకాక

● 8 ఏళ్లుగా సొంత భవనానికి నోచుకోని మండల పరిషత్ కార్యాలయం


అసంపూర్తిగా నిలిచిన ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణం

కడ్తాల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి):కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచింది. కొత్త మండలానికి పరిషత్ ఆఫీసుకు కొత్త భవనం లేక 8ఏళ్లయినా అరకొర వసతులతో అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీశైలం -హైదరాబాద్ హైవేపై ఉన్న కడ్తాల్లో మండల పరిషత్ భవనం నిర్మించాలని కోరుతున్నా ప్రభుత్వం ప ట్టించుకోవడం లేదు. ఎట్టకేలకు స్పెషల్ డెవలప్‌మెం ట్ నిధులు రూ.50లక్షలు మంజూరవగా 2023 సెప్టెంబరు 8న పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ డబ్బు సరిపోయినంత వరకు గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ వేశారు. అదనపు నిధులు రాక, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోక, భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

పనులకు మరో రూ.కోటిన్నర అవసరం

మండల పరిషత్ భవన నిర్మాణం పూర్తి చేయాలంటే రూ.1.5కోట్లు అవసరముందని అధికారులు పేర్కొంటున్నారు. జీ+వన్ ఫ్లోర్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సి వుంది. నిధుల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



కడ్తాల మండల పరిషత్ భవన నిర్మాణ అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలి. అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం కేటాయించాలి. నిధుల మంజూరు కోసం స్థానిక ఎమ్మెల్యే, అలాగే డివిజన్ స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలి. మండల పరిషత్ కార్యాలయానికి సొంత భవనం లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్న అద్దె భవనంలోనూ సరైన వసతుల్లేవు.

- గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్, కడ్తాల్

అదనపు నిధులకు ప్రతిపాదనలు



కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ అసంపూర్తి పనుల పూర్తికి అదనపు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించాం. ఎమ్మెల్యేను కలిసి ఇబ్బందులను విన్నవించాం. గతంలో భవన నిర్మాణానికి రూ.50లక్షలు కేటాయించారు. నిధులు లేక పనులు నిలిచిపోయాయి. పనులు పూర్తిచేయాలంటే రూ.1.5కోట్లు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదన పెట్టాం.

- సుజాత, ఎంపీడీవో, కడ్తాల్

మండల కేంద్రం సాధనకు గట్టిప్పలపల్లి గ్రామస్తుల పోరాటం ఉధృతం

తలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామస్తులు పోరాటాన్ని ఉధృతం చేశారు. మున్ముందుకు ఉద్యమ కార్యాచరణ రూపొందించారు. మండల కేంద్రం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆదివారం గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల, ప్రజాసంఘాల నేతలు, మహిళలు పాల్గొన్నారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గట్టిప్పలపల్లిని మండలం చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 45వ రోజుకు చేరాయి. ఎమ్మెల్యే మండల కేంద్రం ఏర్పాటు విషయంలో చొరవ తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. రాజకీయాలకతీతంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్‌లు శరత్‌చంద్ర, అంజనేయులు, నాయకులు అనిల్, రమేశ్, రవీందర్,రాజు పాల్గొన్నారు.

ఉరుకులు.. పరుగులు

మొదటి రోజు గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం


ఇబ్రహీంపట్నం: శ్రీ ఇందూ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ఇబ్రహీంపట్నం పరిధిలో ప్రశాంతంగా జరిగాయి. ఇబ్రహీంపట్నం పరిధిలో 21, ఆదిభట్ల పరిధిలో మూడు పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 16,584 మంది అభ్యర్థులకు ఉదయం నిర్వహించిన మొదటి పేపర్‌కు 7,469 మంది, మధ్యాహ్నం సెకండ్ పేపర్‌కు 7,444 మంది హాజరయ్యారు. మొదటి పేపర్ పరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30గంటల వరకు నిర్వహించారు. పరీక్ష సమయానికి అరగంట ముందే సెంటర్ల గేట్లు మూసేశారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీ ఇందూ ఇంజినీరింగ్ పరీక్ష కేంద్రం వద్ద ఆలస్యంగా వచ్చిన ఆరుగుర్ని అనుమతించలేదు. ఇబ్రహీంపట్నం వినోబా నగర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలోకి వెళ్లేందుకు బస్సు దిగి ఇబ్బంది పడుతున్న ఆపరేషన్ అయిన మహిళను ఏసీపీ కేపీవీ.రాజు తన వాహనంలో సెంటర్ వద్ద డ్రాప్ చేశారు. సెంటర్లను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు సందర్శించి రక్షణపై పర్యవేక్షించారు.

మొయినాబాద్ రూరల్: గ్రూప్-2 పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలో ఏడు ఎగ్జామ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం 5,503 మంది అభ్యర్థులకు గాను 1,479 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా.. 4,024 మంది పరీక్ష రాయలేదని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజీత్‌రెడ్డి తెలిపారు.


మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్‌లోని చైతన్య యూనివర్సిటీ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

దైవభక్తితో ముందుకు సాగాలి


కందుకూరు: దెబ్బడగూడలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు దైవభక్తితో మెలుగుతూ ముందుకు సాగాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం దెబ్బడగూడలో అయ్యప్ప ఇరుముడి పడిపూజకు ఆమె హాజరయ్యారు. అంతకు ముందుకు సరస్వతిగూడలో ప్యాక్స్ వైస్ చైర్మన్ విజయేందర్ రెడ్డి నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. దైవ కార్యక్రమాల్లో యువత పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, డి.చంద్రశేఖర్, ఎలుక మేఘనాథ్‌రెడ్డి, బర్కం వెంకటేష్, పొట్టి ఆనంద్, ఢిల్లీ గణేష్, మన్నె జయేందర్ ముదిరాజ్, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, దెబ్బడగూడ గ్రామ అయ్యప్ప మాలధారులు, సమీప గ్రామాల భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేశంపేట: మాజీ ఎంపీపీ వై.రవీందర్ లేమామిడిలో అయ్యప్ప భక్తుడు రాఘవేందర్ నిర్వహించిన పడిపూజలో పాల్గొన్నారు. మానసిక ఒత్తిడిని జయించేందుకు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. అయ్యప్ప మాలధారులు శబరిమల అయ్యప్ప దర్శనానంతరం ఇంటికి క్షేమంగా చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, మురళీధర్‌రెడ్డి, జమాల్‌ఖాన్, అంజిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, జహంగిర్, రాఘవేందర్, భూపాల్, గోపాల్, జి.నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, నరేష్ పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్: మండల పరిధి నానాజీపూర్‌లో ఈశ్వర్‌జీ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బిసతీష్, నాయకులు శ్రీనివాస్, డీసీసీబీ కో-ఆప్షన్ సభ్యులు మోహన్‌రావు, నర్సింహ, జంగరావు, లింగం శ్రీశైలం పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో ప్రముఖ వ్యాపారి మలిపెద్ది రంగయ్యగుప్తా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాస్ గుప్తా, చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయం వద్ద అయ్యప్పలకు వ్యాపారులు యంసాని నర్సింహులు, శ్రీనివాస్, అక్షయ్‌లు అన్నదానం చేశారు.

వైస్ చైర్మన్ మల్లేష్‌కు సీపీఐ నాయకుల పరామర్శ

షాబాద్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి):ప్యాక్స్ వైస్‌చైర్మన్ మద్దూరి మల్లేష్ గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స ఇంటికొచ్చారు. ఆదివారం ఆయనను బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మాజీ సర్పంచ్ రవీందర్, మధు పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


మల్లేష్‌ను పరామర్శిస్తున్న నాయకులు బర్క కృష్ణ, పి.జంగయ్య తదితరులు

శంషాబాద్‌లో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం

శంషాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సభ్యత్వాన్ని పెంచి కమ్యూనిస్టుల గొప్పతనాన్ని చాటాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ 99సంవత్సరాలు పూర్తిచేసుకొని వందో వసంతంలోకి అడుగు పెడుతోందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం శంషాబాద్‌లోని ఆయా బస్తీల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ పేదల కోసం, వారి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వాలతో కొట్లాడుతున్నది సీపీఐ అన్నారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్ పట్టణంలో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. గత 99సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల పక్షానఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో మల్లేష్, పొన్నేష్, లక్ష్మయ్య, అశోక్, మణెమ్మ పాల్గొన్నారు.


సీపీఐ సభ్యత్వం చేయిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటిపర్వతాలు

స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సమాయత్తం కావాలి


బూత్ కమిటీ అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న లక్ష్మణ్, శ్రీకాంత్‌సింగ్, వెంకటయ్య

ఆమనగల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి మొక్తాల వెంకటయ్య పిలుపు నిచ్చారు. హామీలను విస్మరించి నియంత పాలన సాగిస్తున్న కాంగ్రె‌స్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు ఉదయ్ నగర్ కాలనీలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ బలోపేతం, బూత్ కమిటీ ఎన్నికల నిర్వాహణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం తదితరాలపై చర్చించారు. అనంతరం 180వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా తల్లోజు శ్రీనివాస్, కార్యదర్శిగా బండమీద మహేశ్, ప్రముఖ్‌గా టిల్లు, మన్ కీ బాత్ ప్రముఖ్‌గా గుండ్రాతి రమేశ్, బూత్ లెవెల్ ఏజెంట్‌గా కృష్ణయ్య, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్‌గా కిట్టులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ తిరుగులేని శక్తిగా తయారైందన్నారు. ప్రధాని మోదీ పాలనాదక్షతతో పదేళ్లలో దేశం అద్భుత విజయాలు సాధించిందన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లపై ప్రజల ఆశలు సన్నగిల్లాయని ఈనేపథ్యంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా సంఘటితంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, గిరియాదవ్, ఎన్.లక్ష్మణ్, వరికుప్పల రాజు, చాకలి యాదయ్య, టి.రవి, జగన్, ప్రవీణ్, శ్రీకాంత్, రవితేజ, నిఖిల్, నాగయ్య, ఉమేశ్ పాల్గొన్నారు.

సొంత డబ్బుతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు హర్షణీయం

షాద్‌నగర్, డిసెంబరు 15:(ఆంధ్రజ్యోతి): గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగు నీటిందించేందుకు సొంత డబ్బుతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం వెంకన్నగూడ తండాలో దివంగత టిక్యానాయక్ జ్ఞాపకార్థం గ్రామవాసి డాక్టర్ ఆనంద్‌నాయక్ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను దాతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం దాతలు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కూడా గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. వచ్చే ఐదేండ్లలో గ్రామాల రూపురేఖలు మారనున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజుగౌడ్, చెంది తిరుపతిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.


నూతన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మహిళలకు ప్యూరిఫైడ్ నీటి బిందెలు ఎత్తుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

తలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆరోగ్య శ్రీ, సీఎంఆర్ఎఫ్‌ల ద్వారా పేదలకు వైద్య చికిత్సలకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందదని పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలకు చెందిన రవీంద్రాచారికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.60వేలు మంజూరు అయ్యాయి. ఆదివారం వెల్జాలలో నాయకులతో కలిసి ఆయన బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్యచికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ, అజీజ్, ఆరిఫ్, వెంకట్‌రెడ్డి, అశోక్, అబ్బాస్ పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లికి చెందిన వెంకటరమణకు మంజూరైన 60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును పీసీసీ కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీం అందజేశారు. కార్యక్రమంలో అంజయ్య, కృష్ణ, రవీందర్, నరేష్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న డోకూరు ప్రభాకర్‌రెడ్డి

తక్కళ్లపల్లిలో మధుయాష్కీగౌడ్ జన్మదిన వేడుకలు

యాచారం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం తక్కళ్లపల్లిలోని నిలయం సెయింట్ గ్రెగోరియస్ బాలాగ్రామ్ అనాథ పిల్లల మధ్య జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు అంగోత్ వెంకటేష్, మండల నాయకులు మోతీరాం, శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, భగవంతు తదితరులు కేక్ కట్‌చేసి బాలలకు పంచారు. గున్‌గల్ మాజీ ఎంపీటీసీ రామకృష్ణ నగరంలో మధుయాష్కీగౌడ్‌ను కలిసి పూల బొకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


పిల్లల మధ్య మధుయాష్కీగౌడ్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న వెంకటేష్ తదితరులు

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

షాద్‌నగర్, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి) నందిగామ మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకుడు దేపల్లి అశోక్‌గౌడ్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామలో భారీ నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టారని, అయ్యప్ప స్వామి భక్తుడిగా తనవంతు విరాళాన్ని అందజేశామన్నారు.

రోడ్లు బాగుచేయాలని గ్రామస్తుల నిరసన

శంకర్‌పల్లి,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): గ్రామానికి వచ్చే రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయిని, తాము ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. ఆదివారం ప్రొద్దటూర్ వాసులు పెద్ద సంఖ్యలో గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రొద్దటూర్ నుంచి మేడిపల్లి గేట్ వరకు, టంగటూర్ నుంచి ఈర్లపల్లి గేట్ వరకు రోడ్లు గుంతలమయమయ్యాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే యాదయ్య, అధికారులు స్పందించి బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మల్లారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.


ప్రొద్దటూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

క్రైం కార్నర్

గేమింగ్ హౌజ్‌పై దాడులు .. ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి నాదర్‌గుల్‌లో శనివారం రాత్రి ఓ గేమింగ్ హౌజ్‌పై మహేశ్వరం ఎస్వోటీ టీం, ఆదిభట్ల పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.58,710 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, మూడు ప్లేయింగ్‌కార్డు సెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

భూ కబ్జాకు యత్నించిన వారిపై కేసు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాకు యత్నించిన వారిపై కేసు నమోదు చేసిన సంఘటన ఆదివారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి పక్కనున్న సర్వే నంబర్ 204లో 4ఎకరాల 30 గుంటల భూమిలో 2వేల గజాల్లో భూ జజమాని ఉస్మాన్‌సాదీ 8షెటర్లు వేసి అద్దెకిచ్చారు. ఆదివారం తెల్లవారుజామున జమాలి బ్రదర్స్ మరో 20మంది ఎక్స్‌కవేటర్లతో వచ్చి నాలుగు షెడ్లను కూల్చారు. అక్కడున్నవారిపై జమాలి బ్రదర్స్ రాడ్లు, కట్టెలతో కొట్టి గాయపర్చారు. దాడి చేసిన పది మందిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొందరు పరారీలో ఉన్నట్లు ఉన్నట్లు సీఐ తెలిపారు. బాధితుడు అబ్దుల్ సాదీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

భక్తితోనే మనిషికి సన్మార్గం


పూజలకు హాజరైన ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్ రూరల్ డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భక్తితోనే మనిషి సన్మార్గంలో నడుస్తాడని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మేళ్లబాయితండాలో ఆదివారం జరిగిన ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పూజల్లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఉమ్మడిగా భక్తి కార్యక్రమాలు జరుపుకుంటే ఐక్యత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తండా వాసులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుగుణరవి, శ్రీను, మంగ్యా, తేజ్యా, ఆనంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దైవారాధనతో మానసిక ప్రశాంతత


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

చౌదరిగూడ, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఇష్ట దేవతారాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం చౌదరిగూడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో నిర్వహించిన ఉమామహేశ్వర కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, తద్వారా జీవితంలో మంచి జరుగుతుందన్నారు. యువత హిందూ సంప్రదాయం, సంస్కృతి గురించి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఎంఎస్ నటరాజన్, హఫీజ్, లక్ష్మణ్ నాయక్, శ్రీధర్‌రెడ్డి, నర్సింగరావు, జబ్బార్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొండేటి ఆసుపత్రి వైద్య శిబిరానికి భారీ స్పందన

మహేశ్వరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొండేటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. వైద్యులు సౌమ్య, ప్రమోద్‌కుమార్, భాగ్యరాజు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. అవసరమైన వారికి కావాల్సిన మెరుగైన వైద్యం కోసం సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ కొండేటి మల్లయ్య మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం గైనకాలజీ, సంతాన లేమి, గర్భిణులకు ఉచితంగా ఓపీ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అలాగే ప్రతి సోమవారం బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర సాధారణ వ్యాధులకు ఓపీ ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. అన్ని రకాల వైద్య పరీక్షలపై డయాగ్నస్టిక్స్‌లో 20శాతం రాయితీ కూడా ఇస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోని ఆరోగ్యంగా ఉండాలని వారు కోరారు.


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న కొండేటి ఆసుపత్రి వైద్యులు

రఘునాథ్‌యాదవ్‌కు సేవారత్న అవార్డు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌కు చెందిన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి నడికూడ రఘునాథ్‌యాదవ్‌ను సేవారత్న అవార్డుతో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ సత్కరించారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సదస్సులో రఘునాథ్‌యాదవ్ దంపతులను సన్మానించి, అవారుతో అభినందనలు తెలిపారు.

వేతన వెతలు

(5వ పేజీ తరవాయి)

పోషిస్తున్నారు. చేసిన అప్పులు కుప్పలు కావడంతో కిరాణా షాపు యజమానులు సరుకులు ఇవ్వడం లేదంటున్నారు. పిల్లల స్కూల్ ఫీజులు కూడా చెల్లించుకోలేకపోతున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి ఎస్సీ వసతి గృహాల్లో దినసరి కూలీలుగా, ఔట్ సోర్సింగ్ కింద కూలీలుగా పనిచేస్తున్న కూలీలకు వెంటనే వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని కూలీలు కోరుతున్నారు.

పనిభారం పెరిగింది



హాస్టల్ వర్కర్లపై పనిభారం పెరిగింది. కుక్, వాచ్‌మ్యాన్ లేక కూలీలతోనే అన్ని పనులూ చేయిస్తున్నారు. కూలీలకు పనిభారం పెరిగింది. పనికితగ్గ జీతం రావడం లేదు. వచ్చే జీతం కూడా నెలనెలా ఇవ్వడం లేదు. మాకు 8 నెలలుగా వేతనం అందక అవస్థలు పడుతున్నాం. హాస్టళ్లలో 35, 40ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కూలీలను రెగ్యులరైజ్ చేయడం లేదు. మా సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

- బుచ్చయ్య, శంషాబాద్ ఎస్సీ హాస్టల్ వర్కర్

త్వరగా జీతాలు ఇచ్చి ఆదుకోండి



8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్ వర్కర్స్ జీతాలు త్వరగా మంజూరు చేయాలి. వర్కర్స్‌పై పనిభారాన్ని తగ్గించాలి. ప్రతీ ఐదో తేదీలోపు జీతాలివ్వాలి. నెలల తరబడి జీతాలు ఇవ్వక కుటుంబ పోషణ భారంగా మారుతుంది. ప్రభుత్వం పట్టించుకోవాలి.

- శ్రీనివాస్, రాజేంద్రనగర్ హాస్టల్ వర్కర్